క్లుప్తంగా

రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక


బుచ్చిరెడ్డి, అధ్యక్షుడు,


మారయ్య, కార్యదర్శి

గట్టుప్పల్ : రైతు సంఘం గట్టుప్పల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన ముసుకు బుచ్చిరెడ్డి, కార్యదర్శిగా వెల్మకన్నె గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ చాపల మారయ్య ఎన్నికయ్యారు. ఆదివారం నిర్వహించిన ఆ సంఘం మహాసభలో వీరిని సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన కమిటీ ఎన్నిక


కోటిరెడ్డి, అధ్యక్షుడు

నల్లగొండ : పట్టణంలోని అలకాపురి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వల్లపురెడ్డి కోటిరెడ్డి అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా హరినారాయణ, ప్ర.దాన కార్యదర్శిగా లక్ష్మయ్య, కోశాధికారిగా బ్రాహ్మణచారి, సహాయ కార్యదర్శిగా అద్దంకి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

యోగాపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న జ్ఞానానందగిరిస్వామి

నల్లగొండ టూటౌన్ : నాగర్ కర్నూల్‌లోని జ్ఞానతపోవన ఆశ్రమం నిర్వాహకుడు జ్ఞానానందగిరి స్వామి ఆదివారం నల్లగొండ పట్టణంలోని యాదవ సంఘం భవన్‌లో యోగా సాధకులకు క్రియా యోగంపై ఉచిత శిక్షణ ఇచ్చారు. నిష్కమకర్మ యోగాలోని క్రియా యోగం, మానసిక, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగ సాధకులు పాల్గొన్నారు.

నేడు విజయోత్సవ తిరంగా ర్యాలీ

నకిరేకల్ : ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా నకిరేకల్ పట్టణంలో బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విజయోత్సవ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్ తెలిపారు. సైనికుల వీరోచిత పోరాటంతో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైనందున వీర జవాన్లకు అభినందనలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు శ్రీకనకదుర్గ ఆలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని, అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు


పూజలో పాల్గొన్న నాయకులు

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి కంఠమహేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పార్టీ నాయకులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, ఆర్టీఏ సభ్యుడు కూసుకుంట్ల రాజిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండెబోయిన భిక్షం, గోలి నర్సిరెడ్డి, గోలి జగాల్‌రెడ్డి, బోగారి రాంబాబు, నల్లబోతు శ్రీను, వరికుప్పల రవి, చనగాని యాదగిరి, చనగాని రమేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో భక్తుల సందడి


పూజలు నిర్వహిస్తున్న హాలియా ఎస్‌ఐ సతీష్ రెడ్డి దంపతులు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం హాలియా ఎస్‌ఐ దేవిరెడ్డి సతీష్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పసుపు కుంకుమలతో అభిషేకాలు చేశారు. అమ్మవారి వద్ద మొక్కులు చెల్లించుకున్నారు.

జూన్‌లో శిక్షణ తరగతులు

నకిరేకల్: కట్టంగూర్‌లో జూన్ 22, 23వ తేదీల్లో కేవీపీఎస్ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున తెలిపారు. నకిరేకల్‌లోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

పాన్‌కార్డు లేకుంటే రుణం రానట్టే !

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను పక్కన పెట్టిన బ్యాంకర్లు
- దరఖాస్తుదారుల్లో సగం మందికి లేని పాన్ కార్డులు
- వివరాలు సేకరిస్తున్న మెప్మా సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలుకు అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. మొదట్లో నల్లగొండ పట్టణానికి చెందిన యువత దరఖాస్తులు రూరల్ మండలాల సైట్‌లోకి వెళ్లిన విషయం తెలిసిందే. అనంతరం పాన్‌కార్డు సమస్య ఇప్పుడు రుణాల మంజూరుకు మరోసారి అడ్డంకిగా మారింది. నల్లగొండ పట్టణంలో 6500 మందికి పైగానే రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో సగం మందికి పాన్ కార్డులు ఉన్నాయో లేవో తెలియదు గానీ దరఖాస్తు ఫారం వెంట మాత్రం జతపర్చలేదు. 6500 మంది దరఖాస్తుదారుల జాబితాను పట్టణంలోని ఆయా బ్యాంకులకు మున్సిపల్ యంత్రాంగం ఇటీవల పంపించగా వారు ప్రతి దరఖాస్తును పరిశీలించి పాన్‌కార్డు లేని వాటిని పక్కన పెట్టారు. కాగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలతోపాటు మండలాలకు చెందిన వారికి దరఖాస్తులను సైతం బ్యాంకర్లు పాన్‌కార్డు లేదనే కారణంతో పక్కకు పెట్టేస్తున్నారు. ప్రతి దరఖాస్తుకు పాన్‌కార్డు తేవాలని సంబంధిత మున్సిపల్, మండల కార్యాలయాల అధికారులకు సమాచారం అందించారు. ఒకవేళ పాన్‌కార్డు లేకుంటే దరఖాస్తుదారులకు సబ్సిడీ రుణం ఇచ్చేందుకు బ్యాంకర్లు నిరాకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా


దరఖాస్తు పత్రాలను మెప్మాలో అందజేస్తున్న యువత (ఫైల్)

దరఖాస్తుదారులకు సిబిల్ స్కోర్ లేకుంటే బ్యాంకర్లు సబ్సిడీ రుణం ఇవ్వకుండా పక్కన పెట్టేందుకు నిర్ణయించినట్లు తెలిసింది. పక్కాగా ఆధార్ కార్డు, పాన్ కార్డు ఉండి సిబిల్ స్కోర్ చూసిన తరువాతనే సబ్సిడీ రుణానికి అర్హులా కాదా అని బ్యాంకర్లు పరిశీలిస్తున్నారు.

దరఖాస్తుదారులకు ఫోన్లు..

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా సబ్సిడీ రుణం కోసం దరఖాస్తు చేసుకున్నవారికి మున్సిపాలిటీల్లోని మెప్మా సిబ్బంది ఫోన్లు చేసి పాన్ కార్డు వివరాలు సేకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి పాన్‌కార్డులు ఉండగా.. చాలామంది నిరుద్యోగ యువతకు పాన్ కార్డు అవసరం లేకపోవడంతో వారు ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేదు. నిరుద్యోగ యువతకు రుణం ఇచ్చేందుకు పాన్ కార్డు లింక్ పెట్టడడంతో బ్యాంక్ రుణం మంజూరుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవైపు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాన్ కార్డు, సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా సబ్సిడీ రుణాలు ఇవ్వాలని చెబుతున్నా.. బ్యాంకర్లు మాత్రం పాన్ కార్డుకు లింక్ పెట్టడం గమనార్హం.

> **బ్యాంకర్లు పాన్‌కార్డు అడుగుతున్నారు**
>
> ప్రభుత్వం మంజూరు చేయనున్న సబ్సిడీ రుణాల జాబితాను బ్యాంకర్లకు పంపించాం. పాన్ కార్డు లేని దరఖాస్తుదారుల సమాచారం బ్యాంకర్లు అందించారు. పాన్‌కార్డు కావాలని అడగడంతో దరఖాస్తుదారుల నుంచి వివరాలు తెప్పిస్తున్నాం.
>
> –సయ్యద్ ముసాబ్ అహ్మద్, నీలగిరి మున్సిపల్ కమిషనర్

పాన్‌కార్డు ద్వారా లావాదేవీలు జరిపితే ఇన్‌కం ట్యాక్స్ ఫైల్ చేయించాలనే ఆలోచన చాలామందిలో ఉండి పాన్ కార్డు అంటేనే జంకుతున్నట్లు తెలుస్తోంది. అసలు రాజీవ్ యువ వికాసం కింద బ్యాంకు రుణం ఇస్తారా లేక కాలయాపన చేస్తారా అనే అనుమానాలు కూడా చాలామంది దరఖాస్తుదారుల్లో నెలకొంది.

రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు రుణం

రాజీవ్ యువ వికాసం పథకం కింద నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రుణాలు ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద రూ.50 వేల నుంచి గరిష్టంగా రూ.4లక్షల వరకు సబ్సిడీ రుణం మంజూరు చేస్తారు. రూ.50వేలు తీసుకుంటే తిరిగి కట్టాల్సిన పనిలేదు. దీనికి పూర్తి సబ్సిడీ వర్తించనుంది. అదేవిధంగా ఒక రూ.లక్ష తీసుకుంటే రూ.90 వేలు సబ్సిడీ, రూ.2 లక్షలు తీసుకుంటే రూ.లక్షా 60 వేల సబ్సిడీ, రూ.4 లక్షల రుణం తీసుకుంటే రూ.2.80 లక్షల సబ్సిడీ వర్తించనుంది. ప్రతి యూనిట్‌కు అయ్యే ధరను బట్టి సబ్సిడీ కేటాయింపులు జరగనున్నాయి.

అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని వినతి

చిట్యాల : పట్టణంలో జాతీయ రహదారిపై నిర్మిస్తున్న మట్టికట్ట రహదారిపై మూడుచోట్ల అండర్‌పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి చిట్యాల పట్టణానికి చెందిన బీజేపీ నాయకులతో కలిసి అఖిల పక్ష నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న మట్టికట్ట రహదారిపై ఒకేచోట అండర్ పాసింగ్‌ను ఇవ్వడంతో పట్టణంలోని ఇతర ప్రాంతాల వారికి ఇబ్బందిగా మారుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. కార్యక్రమంలో చిట్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, నాయకులు రుద్రవరం లింగస్వామి, కందాటి చంద్రారెడ్డి, ముక్కాముల పరమేష్, ఘట్టోజు నరేంద్రచారి, ఆగు అశోక్, గంజి శ్రీరామ్, గడ్డం గోవర్ధన్, వెంకన్న పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి..

చిట్యాల పట్టణంలో జాతీయ రహదారిపై మూడు చోట్ల అండర్‌పాస్ ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్


కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పార్టీ ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జడల చినమల్లయ్య, నారబోయిన శ్రీనివాస్, గ్యార మారయ్య, మాస శ్రీనివాస్, గుండాల నరేష్, ఎద్దులపురి కృష్ణ, బెల్లి సత్తయ్య, రాజుగౌడ్, ఎండి.అక్బర్, ఏర్పుల పరమేష్, గంజి శ్రీరామ్ పాల్గొన్నారు.

ముస్లిం మత పెద్ద మృతి

నకిరేకల్ : పట్టణంలోని తిప్పర్తి రోడ్డులో నివాసం ఉంటున్న పెద్ద మసీద్ ముస్లిం మతపెద్ద ఎండీ ఖాసీంఖాన్(80) గుండెపోటుతో శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఖాసీంఖాన్‌కు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఖాసీంఖాన్ మృతదేహన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, మైనార్టీ నాయకుడు ఎండీ ఫయీం ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు ..

శాలిగౌరారం : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన చిత్తలూరు గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలు.. తరాల వీరయ్యకు చెందిన ఎద్దు గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో మేత మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలకు తాకి షాక్‌కు గురై మృతి చెందింది.

తైక్వాండోలో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి


పోటీలను ప్రారంభిస్తున్న ఎస్‌ఐ సైదులు

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే తైక్వాండో నేర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ సైదులు అన్నారు. నల్లగొండ పట్టణంలోని సన్‌లైన్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన తైక్వాండో జిల్లా జూనియర్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నారులకు శారీరక శ్రమ అవసరమని, తల్లిదండ్రులు ఆ దిశగా తమ పిల్లలను క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్, షీల్డ్‌లను అందజేశారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగళ్ల రమేష్, జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్, ఈద భాస్కర్, రాజు, జడ ప్రశాంత్, పూర్ణచందర్, కరుణాకర్, శివరాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


మునుగోడు: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం : మండలంలోని మాదారం కలాన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. నాడు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. మాదారం కలాన్ నివాసి, పాఠశాల పూర్వ విద్యార్థి అయిన నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై పాఠశాలలో నాటి జ్ఞాపకాలను పూర్వ విద్యార్థులతో పంచుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనంతుల సత్యనారాయణగౌడ్, పుట్టబత్తుల పార్థసారథి, వేముల సైదులు తదితరులు పాల్గొన్నారు.


శాలిగౌరారం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మునుగోడు: మండల కేంద్రంలోని ఎస్‌ఎస్‌ఎస్‌ఆర్ పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మునుగోడులో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

‘ఊగుతున్న ఉయ్యాల’ పుస్తకం ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరప్రసాద్‌రెడ్డి

కనగల్ : పిల్లల మనోవికాసానికి గేయాలు దోహదం చేస్తాయని అందుకు బాలసాహిత్యం ఉపయోగపడుతుందని శాంత వసంత ట్రస్ట్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాల సాహిత్య సదస్సులో కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన ‘ఊగుతున్న ఉయ్యాల’బాల గేయాల సంపుటిని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, వరప్రసాద్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ బుచ్చిరెడ్డి బాలసాహిత్య తోడ్పాటుకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా దక్షిణ ప్రాంతీయ అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్, జె.చెన్నయ్య, గరిపల్లి అశోక్, డీకె. చదువుల బాబు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పైడిమర్రి రామకృష్ణ, వెడ్డేపల్లి వెంకటేష్, కూకుట్ల తిరుపతి, సునంద, ఉమాదేవి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు


నకిరేకల్ : వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం


చిట్యాల : తాళ్లవెల్లెంలలో వీరాంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

చిట్యాల : మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామంలో ఆర్గానిక్ శ్రీకృష్ణ మందిర్‌లో శ్రీ వీరాంజనేయస్వామి, సరస్వతి, వినాయక, సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్వస్తివాచనం, మంటపారాధన, హోమం నిర్వహించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ నిర్వాహకులు పానుగుళ్ల వెంకటేశ్వర్లు, కల్యాణ్‌చౌదరి, అమరనాథ్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నాగ కిరణ్, రఘుబాబు, హరికుమార్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, జలందర్, ఇందిరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు

నార్కట్‌పల్లి : మండలంలోని బాజకుంట గ్రామంలో బొడ్రాయి పునః ప్రతిష్ఠాపన, గ్రామ దేవతల ఆలయాల పునః ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాల్లో నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ ఎడమ శేఖర్ రెడ్డి, ఎడమ మంజుల, యాణాల కృష్ణారెడ్డి, మల్ల బాలకృష్ణ, నర్సిరెడ్డి, రామదాసు తదితరులు ఉన్నారు.


నార్కట్‌పల్లి : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

వైభవంగా ఆలయ రజతోత్సవం

నకిరేకల్ : పట్టణంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ 25వ వార్షిక రజతోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, గోపూజ, గోవుల కోసం గరుకు స్తంభ ప్రతిష్ఠ, రుద్రహోమం పూర్ణాహుతి, మహా పూర్వక అరుణ సూర్య నమస్కారాలు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మాస కల్యాణం అత్యంత వైభవంగా జరిపారు. ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఉప్పల రమేష్, ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ చౌగోని రాములమ్మ సైదులు, ఆలయ పూజారి జిగురు లక్ష్మీనర్సింహమూర్తి, ధర్మకర్తలు కొండ వెంకన్న, యాదగిరి, ప్రవీణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

గురుద్వార్ సాహిబ్ ప్రారంభోత్సవం


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : పట్టణంలో నూతనంగా నిర్మించిన గురుద్వార్ సాహిబ్ ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీగురు హరగోబింద్ సాహిబ్‌జీ గురుపీఠ బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. అనంతరం సిక్కు మతస్తులు గురుగ్రంథ సాహిబ్‌జీ గ్రంథ పారాయణం చేశారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు గురుద్వార్ సాహిబ్ ప్రబంధ కమిటీ సభ్యులు అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య వేర్వేరుగా పాల్గొన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, జిట్ట బోందయ్య, కోనేటి ఎల్లయ్య, బొబ్బల శివశంకర్‌రెడ్డి, కందాటి రమేష్‌రెడ్డి, పోలెపల్లి సత్యనారాయణ, ఆలయ నిర్వాహకులు సంత్ సింగ్, దిలీప్‌సింగ్, కిర్పాల్ సింగ్, అంగద్‌సింగ్, ధర్మేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలు లేక రాకపోకలకు అవస్థలు !


గట్టుప్పల్ -పుట్టపాక మధ్యలో వరద నీటిలో చిక్కుకున్న ఎస్‌ఐ కారు (ఫైల్)


గట్టుప్పల్-ధర్మతండా మధ్యలో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా మొదలు కాని పనులు

- వర్షాలు వచ్చిన సమయంలో పొంగుతున్న వాగులు
- ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు

గట్టుప్పల్ : వర్షాలు వస్తే గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే దారులు వరద నీటితో నిండిపోతున్నాయి. వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వారం రోజులు మండల కేంద్రంలో జనం అతలాకుతలం అయ్యారు. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడంతో పని నిమిత్తం మండల కేంద్రానికి చేరుకున్న ప్రజలు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక రెండు రోజులు బంధువుల ఇళ్లలో ఉండాల్సి వచ్చింది.

మండలంలో పరిస్థితి ఇలా..

లింకు రోడ్లు సరిగ్గా లేకపోవడంతో గట్టుప్పల్ మండల కేంద్రం నుంచి పక్క గ్రామానికి వెళ్లడానికి కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. మండల కేంద్రం నుంచి ధర్మతండాకు వెళ్లడానికి మధ్యలో కల్వర్టు ఉంది. చిన్న వర్షం వచ్చినా ఈ కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గిరిజనులు ఆ తండాకు చేరుకోలేక నానా ఇబ్బందులు పడుతుంటారు. వర్షం వచ్చే సూచనలు ఉంటే మండల కేంద్రానికి రావడమే మానేసుకుంటున్నారు. గతంలో కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.. కానీ టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టలేదు. అదేవిధంగా గట్టుప్పల్ నుంచి సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి వెళ్లడానికి మధ్యలో ఆరుముళ్ల వాగు ఉంది. చిన్న వర్షానికే ఈ వాగు ఉప్పొంగి పోవడంతో గత సంవత్సరం స్థానిక ఎస్‌ఐ ప్రయాణిస్తున్న కారుకు ప్రమాదం తప్పింది. లచ్చమ్మగూడెం, అంతంపేటకు తహసీల్దారు కార్యాలయం సమీపంలో కల్వర్టు, వెల్మకన్నె నుంచి చల్మెడకు మధ్యలో కల్వర్టులు వర్షాలకు వరద నీటితో పొంగి పొర్లుతుంటాయి దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వాగులు, కల్వర్టులపై వంతెనలు నిర్మించాలని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **వంతెనలు ఏర్పాటు చేయాలి**
>
> 
>
> వర్షాకాలంలో గట్టుప్పల మండల కేంద్రానికి రావడానికి ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కల్వర్టులపై వంతెనల ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలి. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులకు, కేసు నమోదుకు ప్రభుత్వం నుంచి గెజిట్ విడుదల చేయించాలి.
>
> -కంచుకంట్ల సుభాష్, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్


ఆర్థికసాయం అందజేత

మునుగోడు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మునుగోడు పట్టణానికి చెందిన పందుల నర్సింహ కుటుంబ సభ్యులకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి పంపిన రూ.10వేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు అందించారు. అంతకు ముందు నర్సింహ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్వాయి వెంకట్‌రెడ్డి, మారగోని అంజయ్య గౌడ్, మేకల శ్రీనివాస్‌రెడ్డి, ఐతగోని విజయ్‌గౌడ్, పందుల సురేష్, పాపయ్య, గజ్జల బాలరాజుగౌడ్, మార్త మోహన్ రెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

నకిరేకల్: మండలంలోని మంగళపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన కందికంటి శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదివారం బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు గొడ్డేటి సైదులు, చింతల శ్రీను, పెరుమళ్ల నాగయ్య, నకిరేకంటి అంజయ్య, కందికంటి వెంకన్న, గాదరి రాఘవులు, కందికంటి లింగయ్య, నర్సింహ తదితరులు ఉన్నారు.

పవర్‌లూమ్ కార్మికుడి కుటుంబానికి చేయూత


నగదు అందిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నల్లగొండ : పట్టణంలోని పద్మానగర్‌లో నివాసం ఉంటున్న పవర్‌లూమ్ కార్మికుడు మిర్యాల శ్రీనివాస్ కిడ్నీ వ్యాధికి గురై డయాలసిస్ చేయించుకుంటున్నాడు. శ్రీనివాస్ వైద్య ఖర్చుల కోసం ఆయన భార్య మిర్యాల ధనలక్ష్మికి పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ ఆదివారం సంఘం తరపున రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాస్ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి క ర్నాటి యాదగిరి, ఉపాధ్యక్షుడు గంజి రామలింగం, దుడుకు లక్ష్మీనారాయణ, గంజి మురళి, పున్న రమేష్, మనం చంద్రశేఖర్, మూడ వేణు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి


నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులో మానవహారం నిర్వహిస్తున్న ముస్లింలు


బస్టాండ్ సమీపంలో..

నల్లగొండ : రాజ్యాంగాన్ని లెక్కచేయకుండా కేంద్రం తెచ్చిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లును రద్దు చేయాలని పలువురు ముస్లిం నేతలు డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు ఆదివారం నల్లగొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో ముస్లింలు మానవహారం ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మౌలానా అబ్దుల్ బసీర్ ఖాస్మి, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.